ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 2 నవంబరు 2025



కార్తీక ఏకాదశి రోజున ఘోర విషాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గలోని వేంకటేశ్వరాలయం వద్ద శనివారం తొక్కిసలాట జరిగింది. ఊహించని స్థాయిలో భక్తుల రద్దీ పెరిగి వారి మధ్య తోపులాట మొదలైంది. ఎక్కువ మంది భక్తులు ఒకే మార్గం నుంచి ఒక్క ఉదుటున బయటకు వచ్చే ప్రయత్నం చేయడంతో రైలింగ్ విరిగిపడి ఒకరిమీద ఒకరు పడిపోయారు. వారిని తొక్కుకుంటూ చాలామంది బయటకొచ్చే ప్రయత్నం చేయడంతో అక్కడికక్కడే 9 మంది మృత్యువాత పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మరో 15 మంది తీవ్ర గాయాలతో పడిపోవడం కనిపించింది. ఇదంతా పది నిమిషాల్లోనే జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

కళ్లెదుటే ఘోరం

- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరాలయం వద్ద తొక్కిసలాట
- తొమ్మిదిమంది భక్తుల మృతి



కాశీబుగ్గ: తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులు

6 లో

ఆలయాలు భద్రమేనా?

కాశీబుగ్గ ఘటన బాధాకరం

- ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరగడం బాధాకరమని శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఘటన గురించి తెలిశాక దిగ్ర్భాంతి చెందారు. శనివారం ఉదయం గజపతినగరం మండలం మరుపల్లి గ్రామం పర్యటనలో ఉన్న ఆయన హుటాహుటిన పలాసకు బయలుదేరారు. క్షతగ్రాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆ జిల్లా కలెక్టర్, వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గాయాలు పాలైనవారికి ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తుందన్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

- కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయికి అధికారులు
- లోతుగా పరిశీలన
- ప్రత్యేక రోజుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం




ఆలయాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

విజయనగరం/ కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఆలయాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించడంతో శనివారం జిల్లా వ్యాప్తంగా అధికారులు ఆలయాలకు వెళ్లి అక్కడున్న పరిస్థితులను పరిశీలించారు. ఉత్సవాలు, సాధారణ సమయాల్లో వచ్చే భక్తుల సంఖ్య, చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్తీక మాసం నేపథ్యంలో ఈ నెలలో వచ్చే ప్రత్యేక రోజుల్లో దేవాలయాల్లో చేస్తున్న ఏర్పాట్ల గురించి ప్రశ్నించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన ఘటన లాంటివి జిల్లాలో ఎక్కడా జరగకూడదని అధికారులకు కలెక్టర్ నిర్దేశించారు. ఆలయాలు, పిక్నిక్ స్పాట్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తొక్కిసలాటలు జరగకుండా పోలీసు అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ ఏఆర్‌దామోదర్ కూడా ఆదేశించారు. ఆలయాలు వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని, డ్రోన్ కెమెరాలు ఉపయోగించాలని, క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆలయాలు వివరాల సేకరణ

శ్రీకాకుళం జిల్లా పలాస వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట లాంటి ఘటనలు జిల్లాలో చోటుచేసుకుండా ముందస్తుగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భక్తులు అధికంగా వచ్చే ఆలయాల (మిగతా 8వ పేజీలో..)



సత్యం మృతదేహం

సత్యం(ఫైల్)

కొడుకే.. కాలయముడై

- తండ్రిని అత్యంత కర్కశంగా అంతమొందించిన తనయుడు
- తలను వేరుచేసి.. గమేనాలో పెట్టిన వైనం
- ఘటనా స్థలంలో భయానక పరిస్థితి



పోలీసుల అదుపులో నిందితుడు రాము

బాడంగి/బొబ్బిలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మంచం పట్టిన తండ్రిని కంటికి రెప్పలా చూడాల్సిన తనయుడు మృగంలా ప్రవర్తించాడు. కనీసం కదల్లేని తండ్రి పట్ల ఏమాత్రం దయలేకుండా.. అతన్ని అత్యంత కర్కశంగా అంతమొందించాడు. మద్యంమత్తులో మానవీయతను మరిచాడు. గొంతు కోసి తలను వేరు చేసి ఓ గమేనా (సిమెంట్ గోలం)లో పెట్టి ఇంటికి కొద్ది దూరంలో పడేశాడు. శనివారం సాయంత్రం బాడంగి మండలం గొల్లాది గ్రామంలో జరిగిన ఈ ఘటనలో మామిడి సత్యం (62) మృతిచెందాడు. ఈ దారుణాన్ని చూసిన వారంతా చలించిపోయారు. ఆ ప్రాంతంలో భయానక పరిస్థితి ఏర్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గొల్లాది గ్రామానికి చెందిన మామిడి సత్యం కొన్నాళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. కదలలేని స్థితిలో మంచానికే (మిగతా 8వ పేజీలో..)

రక్షిత నీరు సందేహమే



- ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై అనేక ఆరోపణలు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులిచ్చేముందు జరగని నీటి పరీక్షలు
- ప్రమాణాలకు పాతరేస్తున్న యాజమాన్యాలు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం



ఎస్.కోట: ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు లేవని వాటర్ ప్లాంట్‌ను మూయిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నాగూల్‌మీరా (ఫైల్)

శృంగవరపుకోట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాటర్ ప్లాంట్ల నిర్వహణపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఇదే విషయం అధికారుల తనిఖీల్లో సైతం నిర్ధారణ అవుతోంది. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) అనుమతులు తప్పనిసరి. అయితే వీటిని పొందడానికి ముందు ప్లాంట్‌ను తనిఖీ చేయడం లేదు. అనుమతి ఉన్న వాటిని కూడా ఎప్పటికప్పుడు పరిశీలించడం లేదు. దీంతో ప్రైవేటు ప్లాంట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. పంపిణీ చేస్తున్న నీళ్లలో నూరుశాతం నాణ్యతను పాటించడం లేదు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ) ధ్రువపత్రం పొందినవారంతా తిని, తాగే వాటిల్లో ప్రజారోగ్యానికి నష్టం కలిగించే అవశేషాలు లేకుండా విక్రయాలు జరపాలి. అయితే తనిఖీలకు వచ్చిన అధికారులు అనుమతి పత్రాలను మాత్రమే అడుగుతున్నారు. నాణ్యత, కొలమానం వంటి వాటిని పట్టించుకోడం లేదు. ఇదే ఆర్వో ప్లాంటు యజమానులకు కలిసొస్తోంది. పరిశుభ్రమైన నీటిని ఇవ్వాల్సిన వీరు మొక్కుబడి ప్రమాణాలు పాటిస్తున్నారు. ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నారు. ఇలాంటి వాటర్ ప్లాంట్లలో ఈకోలీ బ్యాక్టీరియా వ్యాప్తిచెందడంతో (మిగతా 8వ పేజీలో..)

ప్రమాణాలు ఇలా..

ఆర్వో ప్లాంట్ నుంచి సరఫరా చేసే నీళ్లలో 500-22000 మధ్య టీడీఎస్ (లవణాలు), 6.5-8.5 మధ్య పీహెచ్ (ఆమ్ల, క్షార గుణం), 1-1.5 లీటర్ నీటిలో మిల్లీగ్రాం ఫ్లోరైడ్, 0-45 నైట్రేట్, 0.3-1.0 ఐరెన్, 75-200 కాల్షియం, 30-100 మెగ్నీషియం, 200-400 సల్ఫేట్, 250-1000 క్లోరైడ్‌లు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. అంతకంటే మించితే రక్తపోటు, కిడ్నీ సమస్య, జీర్ణకోశ వ్యాధులు, ఫ్లోరోసిస్, పిల్లల్లో బ్లూబేబీ సిండ్రోమ్, కడుపులో మంటలు తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

శాంపిల్ పంపడం ఓ ప్రయాసే

మన రాష్ట్రంలో ఆహార నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్‌లు లేవు. ఇక్కడ సేకరించే శాంపిల్స్‌ను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని నాచారం ల్యాబ్‌కు పంపాలి. ఇది ఖర్చుతో పాటు వ్యయప్రయాసలకు గురిచేస్తుండడంతో వీలైనంత వరకు అధికారులు శాంపిళ్లను తీయడం మానేస్తున్నారు. నిర్దేశిత ఫీజుతో పాటు వారి వద్ద వున్న ఇతర అనుమతులను బట్టి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రం ఇచ్చేస్తున్నారు.

గాజులరేగ పీఏసీఎస్ ఎందుకున్నట్టో!



- చాలా సంవత్సరాల కిందటే లావాదేవీలు బంద్
- పాలకమండలి ఉన్నా నిధులు సున్నా
- రెండున్నరేళ్లుగా జీతానికి నోచని సీఈవో
- సంఘం పరిస్థితిపై రైతుల్లో నిరాశ

విజయనగరం టౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పేరుకు పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ). పాలక మండలి కూడా ఉంది. కానీ చాలా సంవత్సరాలుగా రైతులకు రుణాలిచ్చింది లేదు. అసలు ఆర్థిక లావాదేవీలే జరగడం లేదు. సిబ్బంది చూస్తే సీఈవో ఒక్కరే. అతనికీ రెండున్నరేళ్లుగా వేతనం అందడం లేదు. విజయనగరంలోని గాజులరేగ పీఏసీఎస్ దుస్థితిది.

రైతులకు రుణాలతో పాటు వారి సంక్షేమాభివృద్ధికి పాటుపడేందుకు ఏర్పాటుచేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు జిల్లాలో కొన్నిచోట్ల బాగానే సేవలు అందిస్తున్నప్పటికీ జిల్లా కేంద్రంలోని గాజులరేగ సంఘం మాత్రం పూర్తిగా మరుగున పడిపోయింది. దాదాపు ముప్పైఏళ్లుగా సేవలకు దూరమవుతూ వచ్చింది.

1990లో సుమారు రూ.1కోటి నిధులతో సంఘం మొదలైంది. మూడునాలుగేళ్ల తర్వాత నుంచే తిరోగమన బాట పట్టింది. అప్పటి సిబ్బంది, పాలక మండలి వైఫల్యంతో మరి కోలుకోలేదు. 2004లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు రుణ మాఫీ కింద సుమారు.రూ.70లక్షలు ప్రకటించడంతో ఒక్కసారిగా లావాదేవీలు (మిగతా 8వ పేజీలో..)

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు

- ఆలయాలకు తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు 7



నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం 7

- వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు డ్రైవ్: కలెక్టర్ 7

6,822 కుటుంబాలకు ఉచిత రేషన్ 7

వివాహం కాలేదని ఆత్మహత్య 7

విద్యార్థులే ఓటర్లు.. నేతలై



క్యూలో ఓటర్లు, ఇన్‌సెట్‌లో ఎన్నికల అధికారులుగా కూడా విద్యార్థులు వ్యవహరిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాల శనివారం కొన్ని గంటల పాటు ఎన్నికల కేంద్రంగా మారింది. విద్యార్థులే ఓటర్లుగా.. ఎన్నికల్లో పోటీదారులుగా.. ఎన్నికల అధికారులుగా అవతారం ఎత్తారు. అచ్చంగా ఎన్నికల వాతావరణం ప్రస్ఫుటమైంది. పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు మూడడ్ల శంకరరావు, ఎస్.జాషువా కుమార్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో కళ్లకు కట్టారు. అందులో భాగంగా ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, ఎన్నికల ప్రచారం చేసే విధానం తదితర అంశాలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ మాక్ ఎలక్షన్‌లో ఆరుగురు విద్యార్థులు పోటీచేయగా, 196 మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకొని తమ నాయకుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దత్తి మధుసూధనరావు, ఇతర ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ధనుంజయ, రాంబాబు, మన్మథరావు, లక్ష్మి, గాంధీ, చెంచునాయుడు తదితరులు పాల్గొన్నారు.



కళ్లెదుటే ఘోరం



కలెక్టర్, ఎస్పీతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

ఊహించని ఘటన.. కళ్లెదుటే ఘోరం.. అంతా నిమిషాల్లో జరిగిపోయింది. తోపులాటలో ఒకరిపై ఒకరు పడ్డారు. ప్రాణభయంతో తొక్కుకుంటూ వెళ్లారు. పది నిమిషాల తర్వాత చూసేసరికి భయానక పరిస్థితి. కొందరు మహిళలు నిర్జీవంగా పడిఉన్నారు. ఓ బాలుడు చలనం లేకుండా ఉన్నాడు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం నిండి పోయింది. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘోరాన్ని చూసిన వారు ఇప్పటికీ తేరుకోలేక పోతున్నారు.

-పలాస నెట్‌వర్క్

- తోపులాటలో ఒకరిపై ఒకరు కిందపడ్డారు
- తొక్కుకుంటూ పరుగులు పెట్టారు
- కాశీబుగ్గ ప్రమాద ఘటనలో ప్రత్యక్షసాక్షులు



బాధితులను ఓదార్చుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ..



ఆలయం లోపల పరిశీలిస్తున్న మంత్రి లోకేష్, పక్కన మంత్రి అనిత



క్షతగాత్రులను పరామర్శిస్తున్న లోకేష్, రామ్మోహన్‌నాయుడు, శిరీష తదితరులు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు



ఘటనపై కలెక్టర్‌ను ఆరా తీస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తమ వారిని పోగొట్టుకుని విషాద వదనంతో..



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్



బాధితురాలికి వైద్య సేవలందిస్తున్న దృశ్యం



ఆలయం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రాణాలతో బయటపడ్డాం..

నరసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్ము, తామరాపల్లి, రెడ్డికపేట, బొరిగివలస తదితర గ్రామాలకు చెందిన దాదాపు 200మందికి పైగా భక్తులు శనివారం కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. తొక్కిసలాట జరగడానికి పదినిమిషాల ముందే ఆలయం నుంచి బయటకు రావడంతో తామంతా ప్రాణాలతో బయటపడ్డామని వారంతా చెబుతున్నారు. ఈ తోపులాట కొంచెం ముందు జరిగితే తామంతా దొరికిపోయేవాళ్లమని.. ప్రాణాలతో బయట పడి ఇంటికి చేరుకున్నామని జమ్ము గ్రామానికి చెందిన టెంక అప్పలనర్సమ్మ, బోర శాంతమ్మ, రెడ్డి నర్సమ్మ, వెలమల రాధ, రెడ్డి నారాయణ, ఇసా అప్పన్నమ్మ, వాన ప్రభ, టెంక శాంతమ్మ తెలిపారు.



పలాస ఆలయానికి వెళ్లి ఇంటికి సురక్షితంగా చేరుకున్న జమ్ము గ్రామానికి చెందిన మహిళలు



తమ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీస్తున్న మహిళ

దర్శనం నుంచి ప్రమాదం వరకు

● **ఉదయం 6 గంటలు:** ఆలయ అర్చకులు, నిర్వాహకులు హరిముకుందపండా.. ప్రథమ దర్శనం చేసుకుని పూజల అనంతరం ఆలయాన్ని తెరిచారు. ● **7 గంటలకు:** భక్తుల రాక ప్రారంభమైంది. ఆ సమయానికి 2వేల మంది వరకూ ఉన్నారు. ● **8 గంటలకు:** భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. దీంతో నిర్వాహకులు వెంకటేశ్వర స్వామి దర్శనానికి క్యూలో రావాలని మైకులో అనౌన్స్‌మెంట్ చేశారు. ● **9గంటలకు:** ఆలయం అంతా కిటకిటలాడడంతో కేవలం దర్శనం మాత్రమే చేసుకొని పూజా కార్యక్రమాలన్నీ బయట ఉన్న గరుడస్తంభం, అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద చేసుకోవాలని మైకులో ప్రచారం చేశారు. ● **10గంటలకు:** జనం రద్దీ తీవ్రంగా ఉండడంతో వాహనాలన్నీ బారులు తీరుతూ ఆలయానికి రెండు కిలోమీటర్ల వరకూ ఉండిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ● **11గంటలకు:** కాశీబుగ్గ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ నర్సింహమూర్తి నలుగురు కానిస్టేబుళ్లతో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అప్పటికే ట్రాఫిక్ అక్కుపల్లి రోడ్డు, శ్రీచైతన్య స్కూల్, కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వరకూ నిండిపోయింది. అర కిలోమీటరు రావడానికి గంట సమయం పట్టింది. ● **మధ్యాహ్నం 12 గంటలకు:** వేలాది మంది భక్తులు దర్శనం చేసుకొని వెళ్లిపోవడానికి ఇన్, ఔట్ గేటు నిండా బా రులు తీరారు. 12.05 నిమిషాలకు తొక్కిసలాట జరిగింది. స్టీల్ బారికేడ్లు విరిగిపోవడంతో అంతా కింద పడిపోయారు. వారి మీద నుంచి భక్తులు పరుగులు తీయడంతో ఊపిరాడక అక్కడికక్కడే 9 మంది మృతి చెందగా, 15మందికి పైగా క్షత గాత్రులయ్యారు. ● **12.10 నిమిషాలకు:** 108 సిబ్బంది హుటాహుటిన వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని తన కారును సైతం అందించారు.

● పోలీసులకు సమాచారం ఇచ్చినా కేవలం ట్రాఫిక్‌ను మాత్రమే నియంత్రణ చేసి ఆలయం లోపలకు అడుగు పెట్టలేదు. ఆలయంలో ఇద్దరు పోలీసులు ఉన్నా ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు. కేవలం పోలీసుల వైఫల్యం ఇక్కడ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆలయానికి కమిటీ అంటూ లేకపోవడంతో కేవలం ఇద్దరు ముగ్గురితోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్, ఆర్ఎస్ఎస్, షిర్డీసాయి, సత్యసాయి బృందాలు స్వచ్ఛందంగా సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నా వారి సహాయం కోరలేకపోయారు. ఈ కారణంగానే భారీ ప్రమాదం జరిగిందని భక్తులు అంటున్నారు.



ఆలయం నుంచి ఆసుపత్రికి తరలిస్తూ..



మహిళల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



ఘటనా స్థలంలో డీఐజీ గోపినాథ్ జట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు, స్థానికులు



గాయపడిన మహిళతో మాట్లాడుతున్న శిరీష



వివరాలు సేకరిస్తున్న అధికారులు

గాయపడిన కంచిలి మండల వాసులు..

కంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ లోని తొక్కిసలాట ఘటనలో కంచిలి మండలం జలంత్రకోట పంచాయతీ మధుపురం గ్రామానికి చెందిన కొరికాన సంగీత, కొరికాన చంద్రమ్మ, బడ్డి యశోదమ్మ స్వల్పంగా గాయపడ్డారు. అధికా రులు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి చికిత్స అందించి, స్వస్థలాలకు పంపించారు. ప్రస్తుతం తాము క్షేమంగానే ఉన్నామన్నారు.

ఘటనా స్థలం వద్ద ఆర్తనాదాలు..

ఘటన స్థలం వద్ద భక్తుల ఆర్తానాథాలు వినిపించాయి. ఒకేసారి ఇన్‌గేట్, అవుట్‌గేట్ నుంచి భక్తుల తాకిడితో పెరగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. భక్తులు కాపాడాలంటూ ఆర్తనాథాలు చేయగా, కొందరు రైలింగ్‌ను నెట్టుకుంటూ మెట్ల నుంచి కిందకు పడిపోయారు. ఇంకొంతమందిని తోటి భక్తులు పట్టుకోవడంతో బతికిబయటపడ్డారు. భక్తులు గుంపుగా పడడంతోనే తొక్కిసలాట జరగడానికి ప్రధాన కారణమైంది. ఈ సమయంలో వలంటీర్లు, పోలీసులు లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగింది.

కళ్లముందే రాలిపోయారు..



తన కళ్ల ముందే ఒకరికొకరు కిందపడి నలిగిపోయారు. వారంతా క్షేమంగా ఉన్నారని అనుకున్నాను. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. అప్పటికీ తాను కేకలు వేస్తున్నా ఒకేసారి అంతా ఆర్తనాదాలు చేయడంతో నా గొంతు వినిపించలేదు. లేకుంటే కనీసం ఒకరినైనా బ్రతికించుకునేదాన్ని.

-వీరమ్మ

పోలీసులు లేరు..



నా కళ్ల ముందే ఈ దుర్ఘటన జరిగింది. కిందపడిన వారిని బయటకు తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో పోలీసులు గాని, వాలంటీర్లు గాని లేకపోవడంతో మృతుల సంఖ్య పెరిగింది.

-జనపాన తేజ, టెక్కలి మండలం



పలాసలో ఆస్పత్రి వద్ద గుమిగూడిన క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు





ఎంతపని చేశావు దేవుడా.. అయిన వారిని పోగొట్టుకుని విషాదంతో..

పది నిమిషాల్లో ఘోరం..

పలాస/రూరల్/కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు/హరిపురం/మెళియాపుట్టి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఆలయానికి ప్రతి సోమ, శనివారాల్లో రెండు నుంచి 5వేల మంది వరకూ భక్తులు వస్తుంటారు. ఈ శనివారం కార్తీక ఏకాదశి కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బస్సులు, ఆటోలు, కార్లపై 25వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయానికి వచ్చే.. పోయే మార్గం ఒక్కటే ఉంది. ఈ మార్గంలో మధ్యాహ్నం 12.05 గంటలకు ఔట్ గేటు నుంచి, ఇన్‌గేటు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించడంతో చిన్న తొక్కిసలాట ప్రారంభమైంది. స్టీల్ బారికేడ్లలో కొంతమంది భక్తుల కాళ్లు చిక్కుకుపోవడంతో తీవ్రంగా రోదించారు. దీంతో ఏదో జరుగు తుందని భావించి ఒకేసారి అంతా అదే మార్గం నుంచి ఒక్క ఉదు టన బయటకు వచ్చే ప్రయత్నం చేయడంతో రైలింగ్ మొత్తం విరిగిపడి ఒకరిమీద ఒకరు పడిపోయారు. వారి ని తొక్కుకుంటూ చాలామంది బయటకొచ్చే ప్రయత్నం చేయడంతో అక్కడికక్కడే 9 మంది మృత్యువాత పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మరో 15 మంది తీవ్ర గాయాలతో పడిపోవడం కనిపించింది. ఇదంతా పది నిమిషాల్లోనే జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఒక్క ఉదుటన వెనుక నుంచి నెట్టినట్లు అయిందని, తాము వెనుదిరిగి చూసుకునేలోపే కిందపడి ఉన్నామని, తమ కళ్ల ఎదుటే చాలామంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ వద్ద ఎటువంటి కాపలాదారులు గాని, పోలీసులు గాని భక్తులను కంట్రోల్ చేయడానికి లేకపోవడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుందని అంటున్నారు.

స్వస్థలాలకు మృతదేహాల తరలింపు..

తొక్కిసలాటలో మృతిచెందిన భక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు అంబులెన్స్‌లలో తరలించారు. పోలీసు బందోబస్తుతో పంపారు. మృతదేహాలను బం ధువులను అప్పగించే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయం

● వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నం ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని మరుపల్లి కేజీబీవీ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతులతో పాటు జడ్పీ పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని, మంత్రి లోకేష్ విద్యాశాఖను తీసుకొని వ్యవస్థను గాడినపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, డీఈవో మాణిక్యంనాయుడు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ రామారావు, డిప్యూటీ డీఈవో మోహనరావు, బీజేపీ నాయకులు రెడ్డి పావని, గంట్యాడశ్రీదేవి, మక్కువ శ్రీధర్, ఎంఈవో విమలమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమా, సర్పంచ్ లెంక రామలక్ష్మి పాల్గొన్నారు.

●బొండపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి టీడీపీ ప్రభుత్వం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.బొండపల్లిలో సమీకృత వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వర్గవైషమ్యాలకు దూరంగా అందరికి విద్య, వైద్యం, ఆరోగ్య కల్పనే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు.సమీపంలోగల వైఎస్‌ఆర్ కాలనీ సందర్శించి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అలాగే నూతనంగా మంజూరైన వృద్ధాప్య పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం గ్రామంలో జేజేఎం ద్వారా ఏర్పాటుచేసిన కుళాయిలనుప్రారంభించారు.గ్రామంలో సీసీరోడ్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని జేఈ అప్పలనాయుడుకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు, టీడీపీ మండలాధ్యక్షులు రాపాక అచ్చెంనాయుడు, మరువాడ, గొట్లాం క్లస్టర్ ఇన్‌చార్జిలు డోకుల శ్రీను, నంమూరి రాజేష్, గొట్లాం పీఏసీఎస్ అధ్యక్షులు శిడగం శ్రీనివాసరావు, రయింద్రం, సీటీపల్లి, బొడసింగిపేట, బి.రాజేరు సర్పంచ్‌లు ముదు నూరు శ్రీనివాసరాజు, నడుపూరి భాస్కర్‌నాయుడు, మీసాల జానకి రావు, ఈదుబిల్లి కృష్ణలతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ ఎం.తిరుపతిరావు, డీఈవో ఎం.మాణిక్యంనాయుడు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో జి.గిరిబాల పాల్గొన్నారు.


బొండపల్లి: మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్


గరివిడి: పింఛన్ అందజేస్తున్న కళావెంకటరావు


కొత్తవలస: వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కోళ్ల లలితకుమారి


విజయనగరంటౌన్: పింఛన్ అందజేస్తున్న అదితిగజపతిరాజు


నెల్లిమర్ల: పింఛన్ నగదు ఇస్తున్న బంగార్రాజు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శనివారం జిల్లాలో వివిధ రకాల సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు.

●జామి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్‌దారులముఖాల్లో చిరునవ్వులు చూడడమే సీఎం చంద్రబాబునాయుడు ఆశయమని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అట్టాడలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు పింఛన్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామినాయుడు, కార్యదర్శి దనియాల పైడిరాజు, తహసీల్దార్ కృష్ణంరాజు,ఎంపీడీవో నాయుడు పాల్గొన్నారు.

●గరివిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొండపల్లి, గొట్నందిల్లో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పింఛన్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●విజయనగరం రూరల్/టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరిపేటలో పింఛన్లను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పంపిణీచేశారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి పాల్గొన్నారు. అలాగే అలాగే విజనగరంలోని 30వ డివిజన్ కొత్త ధర్మపురిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, మాజీ కౌన్సిలర్ గేదెల ఆదిబాబు పాల్గొన్నారు.

●కొత్తవలస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినారవుపల్లి, కాటకాపల్లి, గొల్లపేట, కంటకాపల్లిలో పింఛన్లను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, టీడీపీ నాయకులు కోళ్ల వెంకటరమణ, పీవీ రత్నాజీ, లెంక శ్రీను, కొరుపోలు అప్పారావు , మాకెన సీతారామపాత్రుడు నవీన్ పాల్గొన్నారు.

●నెల్లిమర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ సొమ్మును ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్‌తోపాటు టీడీపీ మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు పతివాడ తమ్మినాయుడు పాల్గొన్నారు.

బాలింతకు సహాయం

మెంటాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లోతుగెడ్డ పంచాయతీ మధుర పోరపు బాడవకు చెందిన బాలింతకు ఎస్పీ దామోదర్ అండగా నిలిచారు. ఈ మేరకు నాలుగు నెలల బాలుడు జనార్దన్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన సంఘటనపై ఆంధ్రజ్యోతి శనివారం నది దాటించలేక.. శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. బాధిత కుటుంబాన్ని కలిసి వాస్తవపరిస్థితి తెలుసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.ఈక్రమంలో ఆంద్ర ఎస్ఐ సీతారాం బాధిత కుటుంబాన్ని కలిశారు. చిన్నారి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు బాలింత కొండమ్మకు ఇరవై కేజీల బియ్యం, రూ.వెయ్యి, కూరగాయలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్కవరపుకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లివీడు సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా కొత్త గాంధీనగర్, అప్పన్నపాలెం, నిమ్మలపాలెం, గంగుబూడి, మల్లివీడు, చిన్నపాలెం, గంగుబూడి జంక్షన్‌లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరంరూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు.మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల అరెస్టు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఓ కళాశాలలో అక్రమాలుజరుగుతున్నాయని పేర్కొని శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్మాణాలు జరుగుతున్న భవనాల్లోనే తరగతులు చేపడుతున్నారని, ఓ ఉమెన్స్ డిగ్రీ కళాశాల పేరుతో అనుమతి తీసుకుని కళాశాల నడుపుతున్నారని ఆరోపించారు. అక్రమంగా 50 వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళనకు దిగారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాము, వెంకటేష్, రవికుమార్, చిన్నబాబు,శిరీష, సోమేష్, జయ, రమణ, సుస్మిత, గుణ పాల్గొన్నారు. కాగా విద్యార్థి సంఘాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని సదరు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ప్రభుత్వనిర్ణయించిన ఫీజులు మాత్రమే తీసుకుంటున్నామని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్లనవంబరు1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలకు వరిపంట నేలకొరిగి మొత్తం నాశనం అయిందని తెలిపారు.

యూఎన్‌వో సదస్సుకు చిట్టిబాబు

నెల్లిమర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యూఎన్‌వో జరిగే రెండో సోషల్ సమ్మిట్‌కు దళిత ఆదివాసీ ప్రతినిధిగా దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకి చిట్టిబాబు హాజరుకానున్నారు.ఈమేరకు జైభీమ్‌రావు భారత్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు,దళిత బహుజన శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంపీ రాజు, గొల్లబాబు, ఓదరపల్లి రాము అభినందించారు. సదస్సుకు శనివారం చిట్టిబాబు బయలుదేరారు.


నెల్లిమర్ల: రామతీర్థం ఆలయంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు


విజయనగరం టౌన్: వేంకటేశ్వరస్వామికి తులసీ పూజ చేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు

● ఆలయాలకు తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు

జిల్లా వ్యాప్తంగా వేంకటేశ్వర, రామాలయాలు, విష్ణు ఆలయాల్లో శనివారం కార్తీక ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారి జాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు.రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి నెల్లిమర్ల, గుర్ల, విజయనగరం మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు ప్రముఖులు ఆలయంలో పూజలుచేశారు. విజయనగరంలోని తోటపాలెం బాలాజీనగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీ పూజలను నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)

ఇంటింటా తాగునీటికి ప్రణాళికలు: ఎమ్మెల్యే

● డెంకాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలో 2028 నాటికి ఇంటింటికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధంచేసినట్లు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. గుణుపూరుపేట, ముగినాపల్లిలో నిర్మించిన జలజీవన్ మిషన్ పథకం, రైతు సేవా కేంద్రాం, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలు ప్రారంభించారు. గుణుపూరుపేట, ముగినాపల్లి మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి కల్వర్టుకు శంకుస్థాపన చేశారు.


పూసపాటిరేగ: మత్స్యకారులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

●నెల్లిమర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. అలుగోలు తోపాటు ఆ పంచాయతీ పరిధిలోని పల్లిపేట, కొత్తూరుల్లో మన ప్రజలతో -మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో వెలుగు వీవోఏపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించారు. సెలవు దినం అయినా ఆదివారమే విచారణ పూర్తి చేయాలని ఏపీఎం సురేష్‌ను ఆదేశించారు.

●పూసపాటిరేగ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కోనాడలోగల వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలి పారు. శనివారం కోనాడలో మత్యకారులకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోనాడలో సాగరతీరం అభివృద్ధి చేస్తానని తెలిపారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు డ్రైవ్: కలెక్టర్

విజయనగరం, కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఈనెల 17 నుంచి 30వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించన్నట్లు కలెక్టరు రామసుందర్ రెడ్డి తెలిపారు. శనివారం తన చాంబర్‌లో కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 1790బృందాలతో ప్రతి ఇంటిలో వయస్సు సంబంధం లేకుండా ఉన్న వారందరిని పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనపై రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలోని జిల్లా వైద్యాధికారి జీవనరాణి, టీబీ అధికారి రాణి, జడ్పీసీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

పర్యాటక రంగాన్నిప్రోత్సహించడానికి హోమ్ స్టే విధానం

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి, పర్యాటకులు బడ్జెట్ ఫ్రెండ్లీ వసతిని అందించడానికి ప్రభుత్వం హోం స్టే బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ విధానం ప్రవేశపెట్టిందని కలెక్టరు సుందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధానం వల్ల పర్యాటకులకు హోటళ్లలో కాకుండా స్థానికులతో కలిసి సొంతింటిలోఉన్న అనుభూతిని కల్పించడం, తక్కువ ఖర్చుతో నాణ్యమైన, పరిశుభ్రమైన వసతిని అందించడంతోపాటు స్థానికులు, గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొంగా భానుమూర్తి డిమాండ్‌చేశారు.విజయనగరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం అధికారికంగా ప్రకటించాలని కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటేష్, కోటేశ్వరరావు, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మహాసభలు

విజయనగరందాసన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కడపలో డిసెంబరు 6, 7 తేదీల్లో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ తొమ్మిదో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి బొడ్డు వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు తెలిపారు.శనివారం విజయనగరంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో గిరి ప్రసాద్, అప్పలరాజు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు...

గజపతినగరం,నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘంజిల్లా కార్యదర్శి బి.రాంబాబు కోరారు. శనివారం పురిటిపెంట గ్రామ సచివాలయం పరిధిలో మహాసభలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీన జరగనున్న మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తొత్తిడి పైడిపినాయుడు, రాకోటి రాములు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు..

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈఏడాది డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి నాలుగో తేదీవరకు జరిగే సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలు విజయవంతం చేయాలని ఈ సంఘ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ పిలుపు నిచ్చారు.ఈ మేరకు భోగాపురంలో గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో వై.సుశీల, రాంబాయి, శ్యామల, కాంతా, రమ పాల్గొన్నారు.

రాజాంలో సమస్యలు పరిష్కరించాలి

రాజాం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజాంలో సమస్యలు పరిష్కరించాలని పట్టణానికి చెందిన ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం రాజాంలో మునిసిపల్ కమిషనర్ కొంచాడ శ్రీనివాసరావును కలిసి సమస్యలను వివరించారు.కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జర జాన నీలయ్య, అధ్యక్షుడు ధర్మాన కృష్ణ, రిటైర్డ్ తహసీల్దార్ దేబారిక రామప్పడు, బొత్స బుద్ధుడు, గౌరి, పాపారావు, జగన్నాధం, తేగల మోహన్ పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

జామి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిద కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలు అర్హులు సద్వినియోగం చేసుకొని ఆర్థికవృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శనివారం ఎల్.కోటలో మండలంలోని రామయ్యపాలెంకు చెందిన లబ్ధిదారునికిఆటో అందించారు.

విద్యార్థినులకు పరామర్శ

గుర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):గుర్ల కేజీబీవీ విద్యార్థినులను ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, టీడీపీనాయకుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి శనివారం పరామర్శించారు. ఇటీవల విద్యుదాఘాతం వల్ల అస్వస్థకు గురైన ఐదుగురు విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్తి శీనివాసరావు, పతివాడ రాజారావు, రేగువలస భాస్కరరావు, తిమనాన లక్ష్మంనాయుడు, తలే అసిరప్పడు పాల్గొన్నారు.

నేత్రదానంతో వెలుగులు నింపాలి

రాజాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మరణాంతరం నేత్రదానం చేసి ఇత రుల జీవితాల్లో వెలుగులు నింపాలని రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాం త్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని సాయినగర్ గాయిత్రీ కాలనీ వాసులు రవ్వ అమడమ్మ, అమ్మవారి కాలనీకి చెందిన కోట్ల నారాయణరావు ఇటీ వల మరణించడంతో వారి నేత్రాలను రెడ్‌క్రాస్ సొసైటీ కళ్యాణ్ మగతపల్లి నేత్రదాన సంస్థ ద్వారా ఇటీవల సేకరించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను అభినందించి పశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఆనందరావు, బెవర జ్యోతిబసు, కొల్లూరు తిరుమలేశ్వరరావు, ఉల్లాకుల నీలకంటేశ్వరయాదవ్, పార్థశారధి పాల్గొన్నారు.

6,822 కుటుంబాలకు ఉచిత రేషన్

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీర ప్రాంత గ్రామాల్లో గల 6822 కుటుంబాలకు మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం ఉచిత రేషన్ అందజేస్తుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. శనివారం మండలలోని చేపలకంచేరులో మత్స్యకారులకు రేషన్ పంపిణీచేశారు. అలాగే పలువురికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, తహసీల్దార్ ఎం.రమణమ్మ, పౌర సరఫరాల అధికారి మురళి, నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


గోవిందరావు (ఫైల్)

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీలోని అప్పన్నపేట చెరువుగట్టు సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగినరోడ్డు ప్రమాదంలో దానాల పేటకు చెందిన దానాల గోవిందరావు(34) మృతిచెందాడు. పోలీసులకథనం మేరకు..దానాలపేటకు చెందిన గోవిందరావు ద్విచక్రవాహనంపై గ్రామం నుంచిభోగాపురం వైపు వస్తున్నాడు. అదే సమయంలో భోగాపురంవైపు నుంచి ముక్కాం వైపు వ్యాన్ వెళ్తోంది. మార్గమధ్య భోగాపురం పంచాయతీలోని అప్పన్నపేట చెరువుగట్టు సమీపంలోగల ఆర్‌అండ్‌బీ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనం, వ్యాన్‌ఢీకొన్నాయి. దీంతో గోవిందరావు తుల్లి రోడ్డుపైపడడంతో అక్కడకక్కడే మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకొన్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. గోవిందరావు డెంకాడ మండలంలోని అక్కివరం సమీపంలో జామతోటలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఆయనకు భార్యముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.గోవిందరావు భార్య కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.పాపా రావు కేసు నమోదుచేశారు.

వివాహం కాలేదన్న విరక్తితో వ్యక్తి ఆత్మహత్య


రాంబాబు (ఫైల్)

గుర్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జంగివలసకు చెందిన బుద్ధి రాంబాబు(30) వివాహం కాలేదని విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్ల హెచ్‌సీ త్రినాథ కథనం మేరకు.. విజయనగరం రాంబాబు పెయింటింగ్స్ వేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ ఇబ్బందుల వల్ల చదువు నిలిపివేశాడు. కొంతకాలం నుంచి స్నేహితుల వద్ద తనకు వివాహం జరగడం లేదని వాపోయేవాడు.30 సంవత్సరాలు వయసు వచ్చినా పెళ్లికాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. హెచ్‌సీ త్రినాథ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలపాతంలో జారిపడి విద్యార్థి మృతి


హేమంత్ (ఫైల్)

పాచిపెంట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆలూరుదారగెడ్డ సమీపంలోని జలపాతంలో నడి మిర్తివలస గ్రామానికి చెందిన విద్యార్థి కొండపల్లి హేమంత్ (18) శనివారం మృతి చెందాడు. స్నేహితులతో కలిసి సరదాగా ఆలూరుదారగెడ్డ గల జలపాతం వద్దకు వెళ్లాడు.జలపాతం వద్ద జారిపడడంతో తల వెనుకభాగంలో దెబ్బతగిలింది.దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దాంతో మిర్తివలసలో విషాదం అలముకుంది. కొండపల్లి గోవింద, పుష్పవతి దంపతులకు ముగ్గురు సంతానం. అందులో ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆఖరి వాడైన హేమంత్‌ను వారు అల్లారి ముద్దుగా పెంచారు. పాచిపెంటలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి, ప్రస్తుతం సాలూరులో ఐటీఐ చేస్తున్నాడు.

గొట్లాం కోనేరులో పడి గుర్తుతెలియని వ్యక్తి..

బొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి):గొట్లాం కోనేరులో పడి గుర్తుతెలియని వ్యక్తిమృతిచెందాడు. ఎస్ఐ యు.మహేష్ కథనంమేరకు గొట్లాం సమీపంలో గల కోనేరులో గుర్తుపట్టడానికి వీలులేకుండా బాగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నవ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహానికి పంచనామా నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేశారు.మృతుడి ఆచూకీ తెలిసినవారు 9121109462 నెంబరుకు సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వంశధారలో మహిళ గల్లంతు

భామిని, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తీక స్నానానికి వెళ్లిన మహిళ గౌడు జడ్డి వంశధార నదిలో గల్లంతైన ఘటన శనివారం కాట్రగడలో చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ, బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు చేరుకుని స్థానికులు నుంచి వివరాలను సేకరించారు. గౌడు జడ్డి దివ్యాంగురాలని, ఆమెకు దైవభక్తి అధికమని గ్రామస్థులు తెలిపారు. మహిళ గల్లంతుపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మహిళకు గాయాలు

రాజాం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని కొత్తవలస జంక్షన్ వద్ద శనివారం ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ గాయాలపాలైంది. ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డ కంచరాంకు చెందిన పంచిరెడ్డి సత్తెమ్మ కొత్తవలసలో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు వెళ్లి వస్తోంది. రాజాం నుంచి చీపురుపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ఢీకొనడంతో సత్తెమ్మ గాయపడింది. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

రాజాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):కంచరాంకు చెందిన సత్యనారాయణ నుంచి 11మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీం తెలిపారు.బెల్ట్‌షాపులు నిర్వహించడం నేరమని పేర్కొన్నారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీ

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాం రాయవలస సమీపంలోగల ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం సిమెంట్ ఇటుక లోడుతో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్తున్న లారీ టైర్లు కూరుకుపోవడంతో ఒరిగిపోయింది. దీంతో గమనించిన డ్రైవర్ లారీ నిలిపివేశాడు. దీంతో మూడుగంటల పాటు రహదారికి ఇరువైపుల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అనంతరం కొంతఇటుకను మరో లారీకి తరలించి యంత్రంతో లారీని రహదారిపైకి తీసుకొచ్చారు. అనంతరం లారీ నిర్మాణ ప్రాంతానికి వెళ్లిపోయింది.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలి

రాజాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యంఅందించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు శనివారం ఒకప్రకటనలో కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

●శృంగవరపుకోట/ లక్కవరపుకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వరాలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి పేర్కొన్నారు. ఏకాదశి పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో రావడంతో ఈ సంఘటన జరిగిందని తెలిపారు.

మెంటాడను విజయనగరంలో కొనసాగించాలి

మెంటాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో కొనసాగించాలని మెంటాడలో యువకులు శనివారం రాత్రి కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం జిల్లా కన్నా విజయనగరం అన్ని విధాలా అనుకూలమని తెలిపారు.

ఆలయాలు భద్రమేనా?

(ఐదో పేజీ తరువాయి)

వివరాలను సేకరించింది. శనివారం కలెక్టరేట్ నుంచి మండల రెవెన్యూ కార్యాలయాలకు సమాచారం ఇచ్చి ఓ ఫార్మెట్‌లో వివరాలు తీసుకున్నారు. కార్తీక మాసంలో భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాలు ఎన్ని ఉన్నాయి? వాటి పరిస్థితి ఏమిటి అనేదానిపై మండల రెవెన్యూ అధికారులు ఆరా తీశారు. ఇప్పటి వరకూ సీసీ కెమెరాలు లేని ఆలయాల్లో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. జాతరలు, పండగలు జరిగే చోట ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసుకోవాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్

ఆలయాలకు వచ్చే భక్తుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో అన్ని ప్రైవేటు దేవాలయాల్లో సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పండగలు, జాతరల సమయంలో బారికేడ్లు, క్యూలైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

రక్షిత నీరు సందేహమే

(ఐదో పేజీ తరువాయి)

చాలా మంది డయేరియా బారిన పడుతున్నారు. పురపాలక, నగరపాలక సంస్థలు, పంచాయతీలు ఉచితంగా సరఫరా చేస్తున్న కుళాయిల నీటి కంటే ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా జరిగే తాగునీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీన్నే సురక్షిత నీటిగా భావిస్తున్నారు. వారి నమ్మకాన్ని అవకాశంగా తీసుకుంటున్న పలువురు తాగునీటి ప్లాంట్ల యాజమాన్యాలు ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా అమ్మకాలు జరుపుతున్నారు. నేరుగా బోర్ల నుంచి తోడిన వాటర్‌ను పట్టి ఇచ్చేస్తున్నారు. కొన్ని పాంట్ల వద్ద అక్కడే మురుగు నీరు ఉంటోంది. కనీస శుభ్రత ఉండదు. మరికొన్ని ప్లాంట్లు మురుగు నీటి కాలువలు, చెరువులు, బందలను ఆనుకుని ఉన్నాయి. ఇంకొన్ని ప్లాంట్లు అతినీలలోహిత (యూవీ) విధానం సరిగా పనిచేయకుండానే నడిపేస్తున్నారు. ఇలాంటివన్నీ ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.

అనుమతులు ఇలా..

జిల్లా పరిధిలో పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధికొక్కటి వాటర్ ప్లాంట్ ఉంది. వివిధ రకాల అనుమతులతో నడిచేవీ కొన్నయితే, ఎటువంటి అనుమతులు తీసుకోకుండా తాగునీటి వ్యాపారం చేసే ప్లాంట్లకు కొదవ లేదు. వీటి ఏర్పాటుకు ముందు స్థానిక సంస్థలు, లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతులు పొందాలి. ప్లాంట్లకు చెందిన బోరు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వాలి. నిబంధనలను అనుసరించి తగిన పరిమాణంలో నీటిని అందించేందుకు పరికరాలు ఉండేలా లీగల్ మెట్రాలజీ చూడాలి. తాగేందుకు సురక్షతంగా నీరు వుండేలా ఆహార భద్రతా ప్రమాణాల శాఖ పరిశీలించాలి. అన్నీ సక్రమంగా ఉన్న ప్లాంట్లకే అనుమతులు ఇవ్వాలి. తరచూ తనిఖీలు చేపట్టాలి. ఇవేమీ చూడకుండానే ఈశాఖల నుంచి అనుమతులు వచ్చేస్తున్నాయి.

నిఘా లోపం

అనుమతులు ఇచ్చిన తరువాత సంవత్సరాల పొడవునా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీకి వస్తే స్థానిక సంస్థల అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు కనిపించరు. వీరొస్తే ఫుడ్ సేఫ్టీ అధికారి రారు. తనిఖీలకు వచ్చే అధికారులు వివిధ ధ్రువపత్రాలను అడుగుతున్నారు. లేవంటే వీటిని పొందాలని చెబుతున్నారు. అంత వరకు ప్లాంట్లను తెరవద్దని ఆదేశిస్తున్నారు. అంతే తప్ప నిబంధనలు పాటిస్తున్నారా? ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారా? అన్న విషయాల్ని పరిశీలించడం లేదు.

కూటమి ప్రభుత్వ పాలన భేష్



పింఛన్ అందజేస్తున్న అప్పలస్వామి

బాడంగి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల పాలన భేష్ అని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. గొల్లాదిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ మొత్తాన్ని రూ. వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచడమే కాక ఒకే విడతలో అందజేస్తోందన్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు సీఎం, డిప్యూటీ సీఎంలు స్వయంగా పరిశీలించి బాధితులను ఆదుకోవడం, సహాయక చర్యలను సమీక్షించడం, పంటల నష్టాలను అంచాలను వేయించడం యుద్ధప్రాతిపదికన చేపట్టారన్నారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.గోవిందరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రౌతు పుండరీకాక్ష, అల్లు సత్యం, బొమ్మి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బాత్‌రూం నిర్మాణం

రామభద్రపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బూసాయవలసలో ఓ వ్యక్తి సీసీ రోడ్డుపైనే బాత్‌రూం నిర్మాణం చేపట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేక పోతున్నారని వారు తెలిపారు. దాంతో ఉమ్మిరెడ్డి శ్రీనుకు పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేశారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

● రద్దీని సమీక్షించిన ఎమ్మెల్యే, ఆర్డీవో



ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బేబీనాయన, ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి అర్ధరాత్రి నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు. కంచరవీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, సింగారపు వీధి, స్వామివారి వీధిలోని వైభవ వేంకటేశ్వరస్వామి, పాతబొబ్బిలిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు జంగాల శివాలయం, దిబ్బవీధి శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ ఆలయంలో తొక్కిసలాట సంభవించి పలువురు భక్తులు మృత్యువాత పడిన నేపథ్యంలో రద్దీగా ఆలయాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దారు ఎం.శ్రీను, సీఐ కటకం సతీష్‌కుమార్. వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే బేబీనాయనతో చర్చించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్త మయ్యారు. భక్తులకు అవగాహన కల్పించారు. క్యూలైన్లను నియంత్రించారు. భక్తులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో లక్ష్మణరావు వివరించారు.

●రామభద్రపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శనివారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొట్టక్కి భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకాలు చేశారు. బూసాయ వలస, ఆరికతోట వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు.

ఇట్లామామిడిపల్లిలో డయేరియా



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో మల్లికార్జునరావు

రామభద్రపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఇట్లామామిడిపల్లి పంచాయతీలో నలుగురు వ్యక్తులు అతిసారతో బాధపడుతున్నారు. వారు బాడంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. మూడు రోజులుగా వారు అతిసారతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అతిసార సోకినవారిలో గొర్లె మంగ, గంట అప్పలనారాయణ, రాయిపల్లి అచ్చమ్మ, లెంక నారాయణ ఉన్నారు. గ్రామంలో అతిసారం సోకిందని సమాచారం అందడంతో జిల్లా పంచాయతీ అధికారి డి.వి.మల్లికార్జునరావు శనివారం గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కరణం విజయభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీకి మెమో జారీ

మండలంలోని ఇటీవల మూడు పంచాయతీల్లో అతిసార వ్యాధి సోకడంతో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటరమణకు అధికారులు మెమో జారీ చేశారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచకపోవడం, సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయకపోవడంతో మెమో జారీ చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా ఇట్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన అతిసార రోగులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం బాడంగి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ అతిసారం సోకడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైసీపీ నాయకుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

● 12 తులాల బంగారు ఆభరణాల అపహరణ

బొబ్బిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలమవారివీధిలో గల ఓ అపార్ట్‌మెంట్ మూడో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు బెవర రామ కృష్ణ ఇంట్లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపు తాళాలు పగలగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో 12 తులాల బంగారు ఆభరణాలను అపహరణకు గురైనట్టు బాధితులు తెలిపారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ రప్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గాదెల వలస జడ్పీ హైస్కూల్‌లో రామకృష్ణ పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె జాహ్నవి పుటపర్తిలో చదువుకుంటోంది. కుమార్తె దగ్గరకు రామకృష్ణ వెళ్లగా, ఆయన భార్య రాధ తమ స్వ గ్రామానికి వెళ్లారు. దాంతో దొంగలు చోరీకి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న రాధ తాళాలు పగిలి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు అవపహరణకు గురైనట్టు పోలీసులకు తెలిపారు. ఈ కేసును అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు.

గాజులరేగ పీఏసీఎస్ ఎందుకున్నట్టో!

(ఐదో పేజీ తరువాయి)

పడిపోయాయి. ఆ తర్వాత నూతనంగా డిపాజిట్ల సేకరణ జరగలేదు. రైతులకు రుణాలు మంజూరు చేయలేదు. దీనికి తోడు రుణం కింద ఇచ్చిన రూ.25లక్షలను రైతుల నుంచి సిబ్బంది వసూలు చేయలేకపోయారు. దీంతో సభ్యుల సంఖ్య 7,500 మంది రైతుల నుంచి మెల్లమెల్లగా 108కి పడిపోయింది. ఇటు డిపాజిట్‌లు లేక అటు రుణాలు మంజూరు కాక డీసీసీబీ నుంచి కూడా నిధులు రాక పూర్తిగా బ్యాంకు సేవలు స్తంభించిపోయాయి. స్థానిక రైతుల నమ్మకాన్నీ కోల్పోయింది.

జనవరి 31తో ముగియనున్న పాలక మండలి గడువు

వచ్చే ఏడాది జనవరి 31తో పాలకమండలి గడువు ముగుస్తుంది. ఆ తరువాత మళ్లీ రెన్యువల్ చేయడమో లేక నూతన పాలకమండలిని ఎన్నుకోవడమో చేయాలి. పాలకమండలి ఉన్నా బ్యాంకులో పైసా నిధులు లేకపోవడంతో బ్యాంకును అభివృద్ధి చేయలేని పరిస్థితి. ఒకవైపు డిపాజిట్‌లు లేక, మరోవైపు మెంబర్ షిప్‌లు రాక, ఇంకోవైపు డీసీసీబీ నుంచి సహకారం లేక పీఏసీఎస్‌ను అభివృద్ధిలోకి ఎలా తీసుకురావాలో తెలియడం లేదంటూ పాలకమండలి సభ్యులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కోరాడ వెంకట్రావు ప్రస్తుతం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే అదితి సహకారంతో ఈఏడాది 800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు మాత్రమే తీసుకువచ్చారు. వచ్చే ఏడాది జనవరి 31తో పాలకమండలి గడువు ముగియడంతో ఉన్న ఈ తక్కువ సమయంలో బ్యాంకును అభివృద్ధి చేస్తారా లేక వదిలేస్తారా అన్నది చూడాలి.

రెండున్నరేళ్లుగా జీతం లేదు

గాజులరేగ సహకార బ్యాంకు సీఈవోగా పనిచేస్తున్న తనకు రెండున్నరేళ్లుగా జీతం అందలేదని సీఈవో సత్యనారాయణ తెలిపారు. ఏటా ఆడిట్ జరుగుతున్నప్పుడు తన చేతిచమురు రూ.10వేలు అవుతోందని వాపోయారు. బ్యాంకులో తానొక్కడినే ఉన్నానని, సిబ్బంది ఎవరూ లేరని చెప్పారు. బ్యాంకు పరిస్థితిని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించి బ్యాంకుకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.

కొడుకే కాలయముడై...

(ఐదో పేజీ తరువాయి)

పరిమితం అయ్యాడు. మాటలు రావు. కాళ్లు, చేతులు కూడా పనిచేయవు. కొడుకు రాము తరచూ మద్యం సేవిస్తూ సైకోగా మారి తండ్రిని, భార్యను, ఇతర కుటుంబీకులను శారీరకంగా హింసిస్తుంటాడని స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం మద్యం మత్తులో రాము భార్యను కొడుతుండగా తండ్రి సత్యం ఆమెను బయటకు వెళ్లిపొమ్మని సైగ చేశాడు. దీంతో రాము మరింత కోపోద్రిక్తుడై కత్తి తీసుకుని తండ్రి గొంతు కోశాడు. తలను వేరు చేసి ఓ గమేనా (సిమెంట్ గోలం)లో పెట్టి ఇంటికి కొద్ది దూరంలో పడేశాడు. తండ్రిని హత్య చేయడానికి ఎటువంటి ఆస్తి వివాదాలు, ఇతర కారణాలేవీ లేవని ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటన తర్వాత ఇళ్లంతా రక్తపు మడుగులో భయానకంగా తయారైంది. తల లేకుండా సత్యం మృత దేహం మంచంపై రక్తపు మడుగులో పడి ఉంది. గ్రామసర్పంచ్ బేతనపల్లి శంకరరావు ఇచ్చిన సమాచారం మేరకు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్యంకు భార్య ఆదమ్మ, ముగ్గురు కుమారులు తవుడు, గౌరు, రాము ఉన్నారు. మొదటి ఇద్దరు కుమారులు విశాఖ పట్నంలో తాపీ మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. నిందితుడైన రాము గొల్లాదిలోనే తల్లిదండ్రులతో ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య గంగమ్మ, ఇద్దరుకుమార్తెలు ఉన్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బొబ్బిలిలో సీపీఎం సంబరాలు



కేక్ కట్ చేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తీవ్ర పేదరికం నుంచి కేరళ రాష్ట్రానికి విముక్తి కలిగిందని అంతర్జాతీయ సంస్థలు అధికారికంగా వెల్లడించడం హర్షణీయమని సీపీఎం నేత పి.శంకరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కేరళ నెంబర్ వన్‌గా రూపొందడం వెనుక పాలకుల దక్షత, చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్నాయన్నారు. 64,006 కుటుంబాలకు ఆదాయం, ఆరగ్యోం, ఆహారం, ఇళ్ల తదితర అవసరాలకు సమగ్ర కార్యాచరణను అమలు చేశారన్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థలు కుటుంబశ్రీ లైఫ్ మిషన్ ఆరోగ్యం తదితర ప్రభుత్వ విభాగాలు చేపట్టిన కార్యక్రమాలు దేశంలో పేదరికం లేని రాష్ట్రంగా కేరళ అవతరించడానికి దోహదపడిందన్నారు. ఇది సీపీఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం సాధించిన గొప్ప విజయమన్నారు. సాధారణ అక్షరాస్యతను నూరు శాతం ఎప్పుడో సాధించగా, డిజిటల్ అక్షరాస్యతలో కూడా వందశాతం సాధించిందన్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నో రకాలుగా మోకాలడ్డుతున్నా కేరళ అద్భుతాలను సాధించగలిగిందనాన్నరు. అలాంటి అద్భుతమైన పాలన సాగిస్తున్న కేరళ ప్రభుత్వానికి దేశవ్యాప్తంగా మద్దతు పలకాలని శంకరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిరెడ్డి గోపాల్, ఉడముల ప్రసాద్, యుగంధర్, కమలమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కారాడ రహదారిపై ట్రాఫిక్‌జాం



కారాడ వద్ద నిలిచిన లారీలు

బొబ్బిలి రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కారాడ రహదారిపై శనివారం ఉదయం ట్రాఫిక్‌జాం అయింది. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వే మునిగిపోవడంతో వాహనాల రాకపోకలకు బొబ్బిలి నుంచి తెర్లాం వైపు మళ్లించిన విషయం తెలిసిందే. అయితే శనివారం బొబ్బిలి నుంచి వెళ్తున్న లారీ కారాడ వద్ద రహదారి గొయ్యిలో దిగబడింది. దాంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

డివిజన్ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో శనివారం డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఏడు మండలాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 100, 200 800 మీటర్ల రన్నింగ్, జావలిన్ త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని ఎంఈవో గొట్టాపు వాసుదేవరావు, గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డివిజనల్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎస్‌వీ నాయుడు ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అప్పలనాయుడు, కిశోర్, తవిటి నాయుడు రిఫరీలుగా వ్యవహరించారు.

రోజూ క్లోరినేషన్ చేయండి

బొబ్బిలి రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటిని అందించే ప్రతిసారి సూపర్ క్లోరినేషన్ చేసి రెండు గంటల అనంతరం నీటిని విడుదల చేయాలని డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. శనివారం పారాది, గొర్లెసీతా రాంపురం, మెట్టవలస తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఆయన సందర్శించారు. ఇంజనీరింగ్ సహాయకులు, సర్పంచులకు నీటి పరీక్ష విధానంపై అవగాహన కల్పించారు. క్లోరినేషన్ పరీక్ష చేసిన నీటిని పరిశీలించారు. క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని అవగాహన కల్పించాలని సూచించారు.

కాలువగట్టు పరిశీలన

బాడంగి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బొత్సవాని వలస వద్ద కోతకు గురైన కాలువ గట్టును ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మల్లినాయుడు చెరువు నుంచి వచ్చే వరద నీటి వల్ల బొత్సవానివలస గ్రామం వద్ద కాలువగట్టు కోతకు గురైన విషయం తెలియడంతో ఎమ్మెల్యే శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వర్షం తీవ్రత తగ్గిన తర్వాత వీలైనంత త్వరగా అక్కడ రిటర్నింగ్ వాల్ నిర్మించాలని ఆదేశించారు. గట్టు ఒడ్డున నివసిస్తున్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే

బాడంగి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బొత్సవాని వలసలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే బేబీనాయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా ఇప్పటివరకు ఎటువంటి ఆలస్యం లేకుండా 1న లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, పీఏసీఎస్ చైర్మన్ లచ్చుపతుల సత్యం, సర్పంచ్ అప్పారావు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, బొత్స ఆదినారాయణ, చింతల శ్రీరాములు, పారాది ఆనకట్ట చైర్మన్ సత్తిబాబు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ఎంపీడీవో పి.రవికుమార్ పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. పింఛన్ పంపిణీ తీరును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏవో అప్పారావు తదితరులున్నారు.

పింఛన్ మానటరింగ్ సెల్ ఏర్పాటు

బొబ్బిలి రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీపై మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ చేస్తున్న సిబ్బందిని, లబ్ధిదారులను కార్యాలయం నుంచి ఎంపీడీవో రవికుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏపీవో లక్ష్మీపతిరాజు, ఏవో అప్పారావు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించండి

రామభద్రపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు మూడడ్ల ఆదిలక్ష్మి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో పత్తిపంటతో పాటు మొక్కజొన్న, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి సాగుచేస్తున్న రైతులకు ఈ అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయన్నారు. సమావేశంలో బీజేపీ కార్యకర్త అప్పయ్యమ్మ పాల్గొన్నారు.